# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ❖ గుంటూరు జిల్లా మంగళగిరి కేంద్రంగా "ప్రజారోగ్య అత్యవసర సేవల కేంద్రం"ను ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

- ❖ ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్-2026)కు విశాఖపట్టణం సర్వ సన్నద్ధమైంది.

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22న ప్రసారమవుతుంది.

==================================

సాంకేతికత వినియోగం ద్వారా రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంభిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్ అమరావతి పర్యటన సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పాడుతుందన్నారు. బిల్ గేట్స్ సహకారంతో వివిధ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని పేర్కొన్నారు. అమరావతి డిజైన్ అండ్ ఫౌండ్రీ, క్వాంటం వ్యాలీగా ఆవిష్కృతం అవుతుందని, డేటా-ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లును తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్స్-ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్-స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మొత్తం 10 రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నామని చంద్రబాబు నాయుడు చెప్పారు.

==================================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో ఈరోజు రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులు గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ బృందంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర@2047 విజన్ లో

భాగంగా సంజీవని ప్రాజెక్ట్, ఏఐ ఆధారిత వ్యవసాయం, విద్యా, ఆరోగ్య రంగాలలో చేపట్టిన ప్రాజెక్టులపై బిల్ గేట్స్ తో కలిసి చర్చించారు. ఆర్టీజీఎస్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ముఖ్యమంత్రి.. బిల్ గేట్స్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రాజెక్ట్ సంజీవని అమలుకు గేట్స్ ఫౌండేషన్ ఏఐ సాంకేతిక సహాయం అందించనున్నట్లు బిల్ గేట్స్ తెలిపారు. రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు దృశ్య మాధ్యమం ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

==================================

రాష్ట్రంలో మంగళగిరి కేంద్రంగా “ప్రజారోగ్య అత్యవసర సేవల కేంద్రం” (పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్) ను ఏర్పాటు చేస్తున్నట్టు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు, అంటు వ్యాధులు ప్రబలినప్పుడు, ఫుడ్ పాయిజినింగ్ కేసులు ఎక్కువగా ఉన్నప్పుడు, కొవిడ్ లాంటి అసాధారణ పరిస్థితులు ఉత్పన్నమయ్యే సందర్భాల్లో తీసుకోవాల్సిన చర్యలను వైద్య, ఆరోగ్య శాఖ ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా తీసుకుంటుందని, ఈ కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఫైరింగ్, పోలీసు, ఇతర శాఖల సమాచారం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. విపత్తుల నిర్వహణ శాఖలో `ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్` పని చేస్తోందని, వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటవుతున్న ఈ కొత్త కేంద్రం అత్యవసర సమయాల్లోనూ బాధితులకు సత్వర సేవలు అందించాలన్న లక్ష్యంతో పని చేస్తుందని మంత్రి తెలియజేశారు.

==================================

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్-2026)కు విశాఖపట్టణం సర్వ సన్నద్ధమైంది. ఈ నెల 18న ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), 19న మిలాన్-2026 కార్యక్రమాలు జరగనున్నాయి. దేశభద్రత, రక్షణకు సంబంధించి భారత్ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పే ఫ్లీట్ రివ్యూ ను పదేళ్ల తర్వాత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుండటంతో తూర్పు నావికాదళం, జిల్లా యంత్రాంగం ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు చేశాయి. నగరంలోని బీచ్ రోడ్డు వేదికగా సాగరతీరంలో రేపటి నుంచి మిలాన్ విన్యాసాలు జరగనున్నాయి. 79 దేశాలకు చెందిన యుద్ధ నౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొనున్నాయి. 19, 20వ తేదీలలో రెండు రోజుల పాటు మిలాన్ హార్బర్ ఫేజ్, 21 నుంచి 25 వరకు సీ ఫేజ్ ప్రదర్శనలుంటాయని అధికారులు తెలిపారు. ఐఎఫ్ఆర్‌కు హాజరుకానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు నగరానికి చేరుకోనున్నారు.

==================================

రెండు రోజుల విరామం అనంతరం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రేపటి నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11న గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రసంగంతో ప్రారంభమైన సమావేశాల్లో ముందుగా ఆయన ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేయడం, 14న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 2026-27 రాష్ట్ర వార్షిక బడ్జెట్ ను సమర్పించడం వంటి ప్రధాన కార్యక్రమాలు జరిగాయి. ఇక రాబోయే రెండు రోజుల బడ్జెట్ పై చర్చ జరగనుంది. మంత్రి పయ్యావుల కేశవ్ ఈ నెల 18న బడ్జెట్ పై జరిగే చర్చకు సమాధానం ఇస్తారు.

విరామం

==================================

గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) రెండవ స్నాతకోత్సవం రేపు జరగనుందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంతెం శాంతా సింగ్ తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్ పరిపాలన భవనంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరావుతారని, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ గౌరవ అతిథిగా హాజరు కానున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారని చెప్పారు. అనతి కాలంలోనే మంగళగిరి ఎయిమ్స్ ప్రజల నుంచి విశేష గుర్తింపు పొందిందని, ప్రతీ రోజు సుమారు 4 వేల మందికి అవుట్ పేషెంట్ సేవలు అందిస్తున్నామని డాక్టర్ శాంతా సింగ్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==================================

విజయనగరం జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీ.టీ. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 రబీ సీజన్‌లో సాగు విస్తీర్ణం 57 వేల 661 హెక్టార్లు కాగా.. ఇప్పటివరకు 73 వేల 060 హెక్టార్లలో పంటలు నమోదయ్యాయని తెలిపారు. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు జిల్లాకు 22 వేల 480 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ఇప్పటివరకు 23 వేల 381 మెట్రిక్ టన్నుల సరఫరా అయినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 4 వేల 908 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని.. మరో 1,400 టన్నులు ఈ నెల 18న జిల్లాకు చేరుకోనున్నాయని వెల్లడించారు.

==================================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 20వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

==================================

దక్షిణ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీనికి అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించిందని పేర్కొంది. ఇది ఈ నెల 18వ తేదీ నాటికి పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ.. నైరుతి బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న తూర్పు భూ మధ్య రేఖ హిందూ మహాసముద్రం మీదుగా మరింతగా బలపడే అవకాశం ఉందని వాతావరణ అధికారి ఎం. వెంకటరావు వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

==================================

ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్  (ఏపీఎంఐపీ) ఆటోమేషన్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఆధునిక సాగు - ఏపీఎంఐపీ ఆటోమేషన్ పథకానికి సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఈరోజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ… సూక్ష్మ సాగు నీటి వ్యవస్థలలో ఆటోమేషన్ ను ప్రోత్సహించడానికి, నీటి సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, రైతులకు శ్రమను తగ్గించడానికి ఏపీఎంఐపీ పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం (రాయితీలు) అందిస్తోందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు పండించే రైతులు ఈ పథకానికి అర్హులని, ఆటోమేషన్ కోసం హెక్టారుకు 40 వేల రూపాయల సూచిక వ్యయంపై రాయితీ లభిస్తుందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

==================================
==================================